## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

సంబేపల్లె : సంబేపల్లెలో ఆదివారం వైఎస్సార్ సీపీ మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని గ్రామ సర్పంచ్ రామచంద్ర నివాసం సమీపంలో బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ.. రీకాంలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో కార్యక్రమంపై చర్చించడం జరుగుతందన్నారు. ఈ సమావేశానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ కమిటీ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

### రేపు 'బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ'

లక్కిరెడ్డిపల్లి: పట్టణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు ఆర్. రమేష్ కుమార్ రెడ్డి నివాసంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపిపి రెడ్డయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు ఆర్. రమేష్ కుమార్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సుగవాసి సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండలంలోని ఉప మండల అధ్యక్షులు, కో–ఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు,, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని వారు కోరారు.

### అన్నదానం పుణ్యకార్యం

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : అన్నదానం మహా పుణ్యకార్యమని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్యామ్ తెలిపారు. శనివారం రామాపురం మండలం బండపల్లె సమీపంలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో రాయచోటికి చెందిన సల్లా బయారెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన భార్య రమణమ్మ ఆర్థికసాయంతో ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు భవిష్యత్తులో చేపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ మహమ్మద్, దాత కుటుంబసభ్యులు, ఆశ్రమం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఉచిత వైద్యశిబిరం

సిద్దవటం: తిరుపతికి చెందిన శ్రీ రామాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారు సిద్దవటం మండలంలోని వంతాటిపల్లె గ్రామంలో శనివారం స్థానిక సర్పంచ్ కొంగా జయలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ కీళ్ల నొప్పులు, జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, తల తిరగడం, గ్యాస్ట్రిక్ ట్రబుల్, జనరల్ విభాగానికి సంబంధించిన వ్యాధులకు దాదాపు 85 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది శామలాదేవి, ప్రసన్న, అశ్వని, మణి, రాము పాల్గొన్నారు.

### బీమాతో కుటుంబాలకు భరోసా



మాట్లాడుతున్న యూఎన్‌బీఐ మేనేజర్ రాఘవ సురేష్

ఒంటిమిట్ట: కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలతో దిగువ, మధ్య తరగతి కుటుంబాలకు భరోసా కలుగుతుందని ఒంటిమిట్ట యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాఘవ సురేష్ అన్నారు. శనివారం మండల పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాల గురించి గ్రామస్తులకు సమావేశం నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జీవన జ్యోతి, ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు.

### జూదరుల అరెస్టు

ఒంటిమిట్ట: మండలంలోని చింతరాజుపల్లి పంచాయతీ పరిధిలో పేకాటస్థావరాలపై శనివారం పోలీసులు దాడి చేశారు. పోలీసుల వివరాల మేరకు చింతరాజుపల్లి పంచాయతీ పరిధిలోని చేనువారిపల్లి, బోయనపల్లి మధ్య ఉన్న ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిలో ఐదుగురిని అరెస్టు చేసి వారివద్ద నుంచి రూ. 51, 490లు నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

### కోళ్లు చోరీ

గాలివీడు : మండలపరిధి గోరాన్ చెరువు గ్రామం కాలనీ సమీపంలో ఉన్న మాజీ ఎంపీటీసీ, రైతు దాసరి చిన్నారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం రాత్రి కోళ్లు చోరీకి గురయ్యాయి. సీసీ కెమెరాల ఉన్నప్పటికీ దుండగులు చాకచక్యంగా దొంగిలించారు. వీటి విలువ దాదాపు రూ. 2లక్షలు ఉండవచ్చని చిన్నారెడ్డి చెబుతున్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# కూటమి వైఫల్యాలను ప్రజలకు చెబుదాం

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి
- జగనన్న రాజ్యం మళ్లీ వస్తేనే పేదల కష్టాలు తీరుతాయి
- హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు ఆర్. రమేష్‌కుమార్‌రెడ్డి
- చంద్రబాబు మోసాలను ఎండగడదాం
- జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి



చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ క్యూర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్. రమేష్‌రెడ్డి, సుగవాసి బాల సుబ్రహ్మణ్యం, నాయకులు

రాయచోటి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు చాటిచెబుదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలోని పార్టీ కార్యాలయంలో రాయచోటి రూరల్ మండల వైఎస్సార్‌సీపీ కమిటీలు, అనుబంధాల విభాగాలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలతో చంద్రబాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ, చంద్రబాబు రీకాలింగ్ మ్యానిఫెస్టోపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చక అన్ని వర్గాల ప్రజలను చంద్రబాబు మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఇరవై లక్షల ఉద్యోగాల కల్పన, నిరుద్యోగ భృతి హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం శూన్యమని విమర్శించారు. కూటమి పాలనలో అంతా చీకటిమయమన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పేదల జీవితాల్లో చీకట్లు నింపారని మండిపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి కూటమి నాయకుల మోసాలను ప్రజలకు వివరించాలని కోరారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత**

రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరగాలంటే తిరిగి జగనన్న రాజ్యం రావాల్సిందేనని హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు రెడ్డప్పగారి రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. ఏడాదిలోనే ఇంత వ్యతిరేకతను మూటకట్టుకున్న ప్రభుత్వం దేశంలోనే ఎక్కడా లేదని విమర్శించారు. సుపరిపాలనలో తొలి అడుగు అంటూ టీడీపీ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. పాలనాపరంగా చేసిన అభివృద్ధి ఏమి లేదని భావించిన కూటమి నాయకులు ప్రజల వద్దకు వెళ్లలేకపోతున్నారని ఎద్దేవాచేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జగనన్న చూపిన బాటలో నడిచి కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

**దోచుకుంటున్న కూటమి నాయకులు**

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చంద్రబాబు మోసాలను ఎండగడదామని జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి బాల సుబ్రహ్మణ్యం కోరారు. స్థానిక నేతల అవినీతి, అక్రమాలను కూడా ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సంక్షేమాన్ని వదిలి ఆర్థిక వనరులను దోచుకోవడంలో కూటమి నాయకులు నిమగ్నమయ్యారని విమర్శించారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లపు రమేష్, మాజీ ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, నాయకులు డాక్టర్ సత్యనారాయణ రెడ్డి, బోరెడ్డి నారాయణ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, దేవేంద్ర, సుధాకర్, చరణ్, తిరుపాల్ నాయుడు, వెంకటరామిరెడ్డి, రమణ, సర్పంచ్ రాజు, హరి, కౌన్సిలర్ కసిరెడ్డి నరసింహారెడ్డి, సుబ్బారెడ్డి, అరుణ్‌కుమార్ రెడ్డి, శాతవాహన సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్ర, వెంకటరామిరెడ్డి, ప్రసాద్, శంకర్ రెడ్డి, రమణా రెడ్డి, ఖాదర్ వల్లి,రెడ్డప్ప రెడ్డి, ఎర్రబయన్న, నల్ల బయ్యన్న, రామాంజులు రెడ్డి, అమరనాథ రెడ్డి, రాజారెడ్డి, మహేష్ రెడ్డి, దివాన్ సాబ్, ఎంపీటీసీలు విశ్వనాథ నాయుడు, రామ్మోహన్ నాయుడు, గంగిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మండల అభివృద్ధికి కృషి

సంబేపల్లె : మండల అభివృద్ధికి కృషి చేస్తామని వైస్ ఎంపీపీ కె. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డిని సంబేపల్లె మండల ఉపాధ్యక్షుడు కె. శ్రీధర్ రెడ్డి శనివారం కలిశారు. వైస్ ఎంపిపిగా తన నియామకానికి సహకరించినందుకు శ్రీకాంత్‌రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు మరింత సేవలందించే విధంగా ముందుకు సాగాలని, నూతన బాధ్యతలు నిబద్ధతతో నిర్వర్తించాలంటూ శ్రీధర్‌రెడ్డికి శ్రీకాంత్‌రెడ్డి సూచించారు.

### నైపుణ్యాలే ఉద్యోగాలకు కీలకం

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : నైపుణ్యాలే ఉద్యోగాలకు కీలకమని, ఆధునిక డిజిటల్ యుగంలో ఆచరణాత్మక నైపుణ్యం సంపాదించడం చాలా అవసరమని బిట్స్ కళాశాల చైర్మన్ మన్సూరు భాస్కర్ తెలిపారు. రామాపురం మండలం బండపల్లె వద్ద గల బిట్స్ కళాశాలలో సెకండియర్ విద్యార్థులకు హ్యాండ్స్ ఆన్ వర్క్‌షాప్ నిర్వహించారు. శనివారం మూడో రోజు ముగింపు సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఇలాంటి వర్క్‌షాప్ వల్ల విద్యార్థులు జ్ఞానాన్ని పెంచుకోవడం డిజిటల్ సిస్టం డిజైన్ రంగంలో ప్రయోగాలు చేయడానికి సిమ్యులైజేషన్ సాధనకు నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏసీఎస్ రెడ్డి, సమన్వయకర్తలు సుమియా సుల్తానా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎంపీ అరెస్టు అప్రజాస్వామికం




పి.దేవనాథరెడ్డి, ఎంపీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

చిన్నమండెం : రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని లిక్కర్ స్కామ్ పేరిట కూటమి ప్రభుత్వం అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పి.దేవనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. లిక్కర్ కేసు పేరిట మిథున్‌రెడ్డిని అరెస్టు చేయడం ప్రభుత్వానికి తగదన్నారు. పెద్దిరెడ్డి కుటుంబంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కక్ష్య కట్టారని ఆరోపించారు.

**ఎంపీ అరెస్టు దుర్మార్గం**

వీరబల్లి: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిని అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గమైన పరిపాలన కొనసాగుతుందని మండిపడ్డారు. ప్రజాదరణ పొందిన మిథున్ రెడ్డిపై ఆధారాలు లేకుండా కక్షసాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు. ప్రజలు నమ్మకంతో ఓట్లు వేసి గెలిపిస్తే కూటమి నాయకులు కక్ష సాధింపు చర్యలు దిగుతున్నారని మండిపడ్డారు.

రైల్వేకోడూరు అర్బన్: ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ప్రజలు హర్షించరని వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి సీహెచ్ రమేష్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మిథున్‌రెడ్డి అరెస్ట్‌ను ప్రజాస్వామికవాదులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఎలాంటి ఆధారాలు, సాక్షాలు లేకుండా అరెస్టు చేసి ఇబ్బంది పెట్టాలనే ప్రయత్నం సరికాదన్నారు.

సుండుపల్లె : రాజంపేట పార్లమెంట్ సభ్యుడు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్ఆర్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్రనాయక్ చౌహాన్ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగంలో అక్రమంగా రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని అరెస్టు చేశారని అన్నారు.

రాయచోటి : రాజంపేట పార్లమెంట్ సభ్యులు మిథున్‌రెడ్డిపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసిందంటూ వైఎస్ఆర్‌సీపీ నేతలు మండిపడుతున్నారు. శనివారం సాయంత్రం రాయచోటిలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర బీసీ కార్యదర్శి సిబ్యాల విజయభాస్కర్, రాష్ట్ర యువజన విభాగం జనరల్ సెక్రటరీ సూరం వెంకటసుబ్బారెడ్డి, ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర అరెస్టును తీవ్రంగా ఖండించారు.

ఓబులవారిపల్లె:చంద్రబాబుముఖ్యమంత్రి అయ్యాక రాష్ట్రంలో రెడ్‌బుక్ పరిపాలనలో భాగంగా అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అక్రమ కేసులు కక్షసాధింపులు అధికమయ్యాయని విమర్శించారు.

లక్కిరెడ్డిపల్లి: ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, జెడ్పీటీసీ రమాదేవి, మాజీ ఎంపిపి రెడ్డయ్య, కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, మండల ఉపాధ్యక్షులునరసింహారెడ్డి, సుబ్బరాయుడు పేర్కొన్నారు.

### పందుల పెంపకందారులకు నోటీసులు

సుండుపల్లె : సుండుపల్లెలో పందుల పెంపకందారులకు పంచాయతీ ప్రత్యేకాధికారి సూచనల మేరకు పంచాయతీ కార్యదర్శి పవన్ శనివారం నోటీసులు జారీ చేశారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో షెడ్లు వేసుకొని ఆ షెడ్లలో మాత్రమే పందులను పెంచుకోవాలని తెలిపారు.

**నోటీసులు**

మండల పరిధిలోని రాయవరం గ్రామ పంచాయతీ చేనేవాండ్లపల్లిలో ప్రభుత్వ గ్రామ కంఠం భూమిలో అక్రమ గృహ నిర్మాణం చేపడుతున్నట్లు పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీకి అధికారులు స్పందించారు. గృహ నిర్మాణం చేపట్టే వ్యక్తులకు తాము ఎటువంటి పట్టా ఇవ్వలేదని తహసీల్దార్ రాతపూర్వకంగా తెలపడంతో వెంటనే నిర్మాణం నిలిపివేయాలని పంచాయతీ కార్యదర్శులు నోటీసులు ఇచ్చారు.

### పరామర్శ

రాయచోటి టౌన్ : రాయచోటి ఓ చానెల్ విలేకరి సాయిరెడ్డి సోదరుడిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయచోటి మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. విలేకరి సోదరుడు సయీశ్వర్ రెడ్డి శనివారం పాము కాటుకు గురయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. రాయచోటి మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు పల్లపు రమేష్, కౌన్సిలర్ కసిరెడ్డి వెంకట నరసింహారెడ్డి, సర్పంచ్ దండు నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

### విద్యార్థులకు నైపుణ్యం అవసరం

కడప ఎడ్యుకేషన్: పాఠశాల స్థాయిలో విద్యార్థి దశ నుంచే నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని శ్రీసాయి కాన్సెప్ట్ స్కూల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుబ్బరాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేవీ త్యాగరాజన్‌లు అన్నారు. రాయచోటి పట్టణం మాసాపేటలోని శ్రీసాయి కాన్సెప్ట్ స్కూల్‌లో కోహార్ట్ లాంగ్ పాడ్ వారిచే రోబిటిక్ వర్కుషాపు నిర్వహించారు. నిర్వహణ బాధ్యులు ప్రవీణ్, శ్రీనివాసులు విద్యార్థులకు నైపుణ్యాలను ప్రదర్శించేలా కృషి చేశారు.

# రోజాపై అనుచిత వ్యాఖ్యలు దారుణం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సురేఖ



రాజంపేట రూరల్: మాజీ మంత్రి ఆర్కేరోజాపై టీడీపీ ఎమ్మెల్యే గాలిభానుప్రకాష్ చేసిన అనుచిత వ్యాఖ్యలు దారుణమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మిరియాల సురేఖ మండిపడ్డారు. శనివారం సురేఖ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థినులకు, యువతులకు, మహిళలకు రక్షణ లేకుండా పోతోందని అన్నారు. బాధ్యతాయుతమైన ఎమ్మెల్యే స్థానంలో ఉండి ఒక మహిళను సభ్యసమాజం సిగ్గుపడేలా, మహిళా లోకం అసహ్యించుకునేలా నీచంగా మాట్లాడటం దారుణమన్నారు. మహిళలను అవమానపరచడం, కించపరచడం అధికార టీడీపీ నేతలకు పరిపాటిగా మారిందని అన్నారు. ఇటీవల కృష్ణాజిల్లా జెడ్పీ చైర్‌పర్సన్, బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళ అయిన ఉప్పాలహారికను టీడీపీ నేతలు అసభ్యంగా దూషిస్తూ ఆమె వాహనంపై దాడి చేసిన ఘటన మరువకముందే మాజీ మంత్రి ఆర్కేరోజాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనలతో టీడీపీ నేతలకు మహిళల పట్ల ఏమాత్రం గౌరవం ఉందో తెలుస్తోందని అన్నారు.

# స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్లే ముద్దు

రైల్వేకోడూరు అర్బన్: రైల్వేకోడూరు మేజర్ పంచాయతీ, సచివాలయం వద్ద సీపీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు సీహెచ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దు.. పాత మీటర్లే ముద్దు అని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా పది సంవత్సరాలపాటు వసూలు చేస్తారన్నారు. అలాగే అడ్వాన్సుగా ప్రతి వినియోగదారుడు ముందుగానే నగదు బదిలీ చేయాలన్నారు. దీనివల్ల చిరు కుటుంబాలు ఇబ్బందులు పడతాయన్నారు. వేలాది మంది వ్యాపారస్తులు, గ్రామీణ ప్రజలు దీనివల్ల ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం రూ. 2700 కోట్లు రకరకాల పేర్లతో వసూలు చేసిందని పేరన్నారు. తిరిగి ఇంధనం చార్జీల పేరుతో రూ. 850 కోట్లు వసూలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు దోచిపెట్టడానికి స్మార్ట్ మీటర్లు అమలు చేయాలని నిర్ణయించుకుంటే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

# కోదండరాముడికి ప్రత్యేక పూజలు

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లె గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సరసా రవికుమార్‌శర్మ ఆధ్వర్యంలో హోమం, నవగ్రహ శాంతి, మూలవిరాట్‌కు అభిషేకము, సంప్రోక్షణ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ మొక్కులను తీర్చుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త గంప సుధాకర్ మాట్లాడుతూ ఆదివారం కోదండ రామాలయ ఆలయంలో ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణం, అనంతరం గ్రామోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.



ఆలయంలో హోమం చేస్తున్న భక్తులు

# కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె

రాజంపేట: తమ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని మున్సిపల్ కార్మికులు శనివారం కూడా సమ్మెను కొనసాగించారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమ్మెలో పాల్గొన్న కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్మికుల సమ్మెతో పట్టణంలో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయాయి. పారిశుద్ధ్య పనులు చేపట్టకపోవడంతో మురికి కాలువల్లోకి చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, మురుగు చేరడంతో నీరంతా రోడ్ల మీదికి ప్రవహిస్తోంది. దుర్గంధం వెదజల్లడంతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, రాత్రిపూట దోమల బెడద తీవ్రంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణవాసులు మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా నేత చిట్వేలి రవికుమార్, మున్సిపాలిటీ కార్మిక నేతలు పీవీరమణ, లక్ష్మీదేవి, ప్రసాదు, సుధీర్, సాలమ్మ, వెంకటరమణ, రవిశంకర్ సమ్మెలో పాల్గొన్నారు.

# మాతమ్మతల్లిని దర్శించుకున్న ఆకేపాటి

రాజంపేట రూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి మాతమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మండల పరిధిలోని పెద్దూరు దళితవాడలో శనివారం మాతమ్మతల్లి జాతర వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆకేపాటికి నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకులు మాతమ్మతల్లికి వేద మంత్రాలతో ప్రత్యేక పూజలు చేసి ఎమ్మెల్యే ఆకేపాటిని ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు ఎమ్మెల్యే ఆకేపాటి అన్నప్రసాదం అందజేశారు.

# ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు, అధ్యాపకులు

రాయచోటి టౌన్ : ప్లాస్టిక్ రహిత సమాజానికి అందరూ కృషి చేయాలని అన్నమయ్య జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జి.మధుసూదన్ కోరారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేదించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం. మునియా నాయక్, ఎన్ఎస్ఎస్ పీఓ ఖ్వాజా, రాయచోటి ఎక్సైజ్ సీఐ వై. గురుప్రసాద్, ఎస్ఐ ఓ. హుస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

**చెన్నముక్కపల్లెలో..**

స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాయచోటి రూరల్ పరిధిలోని రాయచోటి చెన్నముక్కపల్లె గ్రామ సచివాలయం వద్ద స్థానికలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్‌తో పాటు ఎంపీడీవో, అధికారులు పాల్గొన్నారు.

**పరిసరాలు శుభ్రంగా ఉంచుకుందాం**

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే వ్యాధులబారిన పడకుండా ఆరోగ్యం ఉండొచ్చుని రాయచోటి ఫైర్ స్టేషన్ అధికారి వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా ఫైర్ అధికారి అనిల్‌కుమార్ అదేశాల మేరకు రాయచోటి ఫైర్‌స్టేషన్ ఆవరణంలోని పరిసరాలలోని పిచ్చిమొక్కలు, చెత్తను పూర్తిగా తొలిగించారు. ఈ కార్యక్రమంలో రాయచోటి ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గాలివీడు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని మండల ప్రత్యేక అధికారి, జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. మూడవ శనివారం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ముఖ్యంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, నాలుగురోడ్ల కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, ఎంఈఓలు నాగరాజు, శ్రీనువాసులు, పీఆర్ జేఈ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, ఏఓ జాబీర్ అహమ్మద్, కార్యాలయం సిబ్బంది,సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**పరిశుభ్రత అందరి బాధ్యత**

సిద్దవటం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీఓ ఫణి రాజకుమారి, సిద్దవటం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం. శ్రీహరి అన్నారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు, అధికార సిబ్బంది, ఉపాధ్యాయులు సిద్దవటంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ఈఓపీఆర్‌డీ మహతాబ్ యాస్మిన్, పంచాయతీ కార్యదర్శులు రత్నరాజు, జానకి, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నమ్మించి మోసం చేయడమే బాబు నైజం

- 'కూటమి' మోసాలు ప్రజలకు చెప్పాలి
- అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి



చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న ఆకేపాటి, నాయకులు

ఒంటిమిట్ట: ఎన్నికల సమయంలో ఆచరణకు సాధ్యం కానీ హామీలిచ్చి అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయకుండా మోసం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నైజమని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక హరిత కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు టక్కోలి శివారెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్ నాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అనిషారెడ్డి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. బాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అన్నదాత సుఖీభవం ఎప్పుడిస్తారా అని రైతులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు నిరాశలో ఉన్నారన్నారు. వైఎస్ జగన్ పాలనలో కులమతాలకు అతీతంగా ప్రజలందరికి సంక్షేమ పథకాలను అందించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎవరు ప్రశ్నించినా వారిపై అక్రమ కేసులు పెట్టి భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో సంక్షేమ సారథి, రాజన్న బిడ్డ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**మహిళలకు భద్రత కరువు**

కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అనిషారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ మహిళా చైర్‌పర్సన్‌పై దాడి మరువకముందే మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలు సభ్యసమాజాన్ని తలదించుకునేలా ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే దళిత మహిళలపై దాడులు, యువతులపై అత్యాచారాలు హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు లెక్కలేనన్ని జరిగాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో మాజీ సీఎం వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారని, వారి రక్షణ కోసం దిశ అనే ప్రత్యేక పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేసి, వారి రక్షణకు పాటు పడ్డారని కొనియాడారు. అనంతరం చంద్రబాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర మహిళ కార్యదర్శి ఏకుల రాజరాజేశ్వరి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, రాజంపేట నియోజకవర్గం యూత్ విభాగం అధ్యక్షులు కూండ్ల ఓబుల్‌రెడ్డి, మండల పంచాయతీ రాజ్ అధ్యక్షులు మేరువ శివనారాయణ, నాయకులు మేకపాటి నందకిశోర్‌రెడ్డి, తేలూరు శేషారెడ్డి, నాగేశ్వరరెడ్డి, వెంకట కృష్ణారెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బాబు మోసాలను ప్రతి ఇంటికి తెలియజేస్తాం**

సిద్దవటం: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు చేసిన మోసాలను ప్రతి ఇంటికి తెలియజేస్తామని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని కనుమలోపల్లె గ్రామ సమీపంలో ఉన్న ఆకేపాటి గెస్ట్‌హౌస్‌లో శనివారం సాయంత్రం వైఎస్ఆర్‌సీపీ సిద్దవటం మండల సర్వసభ్య సమావేశంలో భాగంగా బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదికి పైగా కావస్తున్నా జగన్ ప్రవేశ పెట్టిన అమ్మఒడి పథకాన్ని కాపీ కొట్టి తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అమలు చేసి.. ఇప్పుడు అది నారా లోకేష్ ఆలోచన అని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవాచేశారు. ఇది చంద్రబాబు దిగజారుడు తనానికి నిదర్శనం అన్నారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో రాజ్యమేళుతున్న అరాచకం, కక్షసాధింపు పాలనను గురించి ప్రశ్నిస్తే వారిపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. వైఎస్. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఇచ్చిన హామీలతో పాటు మరికొన్న సంక్షేమ పథకాలను సంవత్సరంలోనే అమలు చేశారన్నారు. బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ఇంటింటికీ తీసుకెళ్లాల్సిన అవసరం ఎతంతైనా ఉందని ఆయన సూచించారు . అనంతరం కూటమి మోసాలను తెలియజేసే క్యూర్ కోడ్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట నియోజకవర్గం పరిశీలకులు అనీషారెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, అన్నమయ్య జిల్లా అబ్జర్వర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, మైనార్టీసెల్ జిల్లా ప్రధాక కార్యదర్శి వల్లిచాన్, రైతు విభాగం జిల్లా ప్రధానకార్యదర్శి జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, మండల వైస్ ఎంపీపీ నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీటీసీలు చంద్రశేఖర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల యూత్ కన్వీనర్ క్రిష్ణచైతన్య, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ వి. పుల్లయ్య, చేనేత కార్మికల సంఘం మండల అధ్యక్షుడు వెంకట్, మైనార్టీసెల్ మండల అధ్యక్షుడు హిందయతుల్లా, రైతు విభాగం మండల కన్వీనర్ ఏ. రామిరెడ్డి, బీసీ సెల్ మండల కన్వీనర్ ఎల్లయ్య యాదవ్, ఆసుపత్రి కమిటీ డైరెక్టర్‌లు గోపాలస్వామి, ఎం.వి. సుబ్బారెడ్డి, సర్పంచ్ చేపూరి ఓబయ్య, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.